# మక్కపైనే మక్కువ..

- నష్టాలను మిగిల్చిన పత్తి పంట
- యాసంగిలో మొక్కజొన్న సాగు వైపు రైతుల మొగ్గు


అంకుషాపూర్ శివారులో సాగు చేసిన మొక్కజొన్న పంట

టేకుమట్ల: మండలంలో 8340 ఎకరాలకు పైగా రైతులు వానాకాలం పత్తి పంట సాగు చేశారు. సుమారు 70శాతం పత్తి పంట అధిక వర్షాల వల్ల ఎదుగుదల లోపించి తెగుళ్ల బారిన పడింది. ఎకరాకు 15 నుంచి 20 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా కేవలం 10 క్వింటాళ్ల లోపే దిగుబడి రావడంతో కనీసం పెట్టుబడి సైతం రాని పరిస్థితి. దీంతో రైతులు పత్తి పంటను తీసేసి మొక్కజొన్న పంటను సాగుచేశారు. మండలంలో ఇప్పటి వరకు సుమారు 2 వేల పైగా ఎకరాలల్లో మొక్కజొన్న సాగు చేశారు. ఈ సంవత్సరం మొక్కజొన్న సాగులో వివిధ కంపెనీలకు చెందిన ఆడ, మగ వంగడాలు రావడంతో యాసంగిలో ఎక్కువ శాతం రైతులు ఆడ, మగ మొక్కజొన్న సాగు చేస్తున్నారు.

**బెండుతోనే కాంటా..**

లోకల్ మొక్కజొన్న పంట సాగు చేస్తున్న రైతులు మొక్కజొన్నలను మాత్రమే మార్కెట్‌లో విక్రయించాలి, లేదా పచ్చి కంకులనే అమ్ముకోవాలి. కానీ ఆడ, మగ వంగడాల మొక్కజొన్న సాగులో బెండుతో సహా కాంటా పెట్టుకోవడంతో అధిక బరువుతో పాటు, సమయం, ఖర్చు ఆదా అవుతుందని రైతులు తెలుపుతున్నారు. అలాగే క్వింటాల్‌కి రూ.2800 నుంచి 3200 ధర పలకడంతో, ముందస్తు పెట్టుబడి సాయం సైతం అందించడంతో రైతులు ఆడ, మగ వంగడాల మొక్కజొన్న సాగుకే మొగ్గు చూపారు.

### మూడెకరాల్లో సాగు చేస్తున్నా..



నాలుగెకరాల వ్యవసాయ భూమిని కౌలుకు తీసుకుని ఎకరంలో మిరప, మూడెకరాల్లో వానాకాలం పత్తి పంటను సాగు చేశా. పత్తి పంట ఎదగక పోవడంతో పాటు, కుళ్లు రావడంతో పూర్తిగా తీసేసి యాసంగిలో మొక్కజొన్న పంట వేశా. కౌలుకు తీసుకున్నందుకు నీళ్లు లేకుంటే కనీసం పెట్టుబడి కూడా వచ్చేది కాదు. పత్తి నష్టాలను మిగిల్చినా మొక్కజొన్నపైనే ఆశలు ఉన్నాయి.

- బండి కుమార్ కౌలు రైతు అంకుషాపూర్

### మొక్కజొన్న వేశా..



పత్తి పంట పూర్తిగా నష్టాలను మిగిల్చడంతో యాసంగిలో ఆడ, మగ మొక్కజొన్న సాగు చేస్తున్నా. పత్తి పంట నష్టాన్ని మిగిల్చింది. కనీసం మొక్కజొన్నలో అయినా నష్టం రాకుండా లాభాలను మిగుల్చుతుందనే ఆశతో పంటను వేశా. ఇప్పటి వరకు పంట బాగానే ఉంది.

- అచ్చె సంతు, రైతు రామకిష్టాపూర్(టీ)

## క్లుప్తంగా

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రేగొండ: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా నేడు (శుక్రవారం) విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనున్నట్లు విద్యుత్ అధికారులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి అధికారులకు సహకరించాలని కోరారు.

### హాస్టల్‌ను పునఃప్రారంభించాలి

భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి మండలంలోని జాంనగర్ గ్రామంలో గతంలో ఉన్న ఎస్సీ హాస్టల్‌ను పునఃప్రారంభించాలని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా యువజన కన్వీనర్ కొండ సాయి తేజ ప్రభుత్వాన్ని గురువారం ప్రకటనలో కోరారు. 13 సంవత్సరాల క్రితం హాస్టల్‌ను మూసివేయడం జరిగిందన్నారు. భవనం ఖాళీగా ఉండటంతో మందు బాబులకు, అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి హాస్టల్‌ను ప్రారంభిస్తే చుట్టూ పక్కల గ్రామాల్లో ఉన్న పేద విద్యార్థులకు సౌకర్యంగా ఉంటుందన్నారు.

### సంక్షేమ పథకాలు అందించాలి

చిట్యాల: రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు ఇందిరమ్మ ఇళ్లు, కొత్త ఫించన్లు మంజూరు చేయాలని దివ్యాంగుల సంఘం నాయకుడు పుల్ల మల్లయ్య గురువారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. ఈ నెల 26 నుంచి చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో దివ్యాంగులందరికీ అవకాశం కల్పించి ఇళ్లతో పాటు అర్హులైన వారికి కొత్త ఫించన్లు మంజూరు చేయాలన్నారు.

### నియామకం



రేగొండ: మండల కేంద్రంలోని ఇన్‌స్పైర్ యూత్ నూతన కమిటీని గురువారం నియమించారు. అధ్యక్షుడిగా మాడగాని నరేష్, ఉపాధ్యక్షులుగా ఎంజాల శివ ఎన్నికయ్యారు. యూత్ నాయకులు ఎంజాల అనిల్, మోటపోతుల నాగరాజు, గండి సుమన్, భిక్షపతి, సురేష్, నరేష్, విజయ్, రామకృష్ణ, శ్రీకాంత్, రాజు, శివ, నవీన్, రాము తదితరులు పాల్గొన్నారు.

### బహుమతుల ప్రదానం



మల్హర్: మండలంలోని ఎడ్లపల్లి గ్రామంలో సంక్రాంతి, కనుమ సందర్భంగా బత్తుల రామకృష్ణ, మహంకాళీ ఎలాక్ట్రానిక్స్ ఆధ్వర్యంలో క్రికెట్, బ్యాట్మింటన్ టోర్నమెంట్ నిర్వహించారు. కాగా విజేతలకు గురువారం నిర్వాహకులు బహుమతులను ప్రదానం చేశారు.

### ఇసుక డంపు స్వాధీనం



రేగొండ: మండల కేంద్రంలో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంపును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సందీప్ కుమార్ గురువారం తెలిపారు. ఇసుక డంపును పోలీసులు స్వాధీనం చేసుకుని రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు పేర్కొన్నారు. గ్రామాల్లో ఎవరైనా అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

### చెరువుల పరిశీలన



కాటారం: చిన్న కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో భాగంగా అనుసంధానం చేయడం కోసం పలు చెరువులను గురువారం ఇరిగేషన్ అధికారులు పరిశీలించారు. మండలంలోని బొప్పారం, ప్రతాపగిరి పల్లకొమ్ముకుంట, గుడెపుచెరువు, గుర్రలకుంట, కోమటికుంట చెరువులను పరిశీలించి చిన్న కాళేశ్వరం ప్రాజెక్ట్‌తో అనుసంధానం చేయడానికి స్థితిగతులపై ఆరా తీశారు. మంత్రి శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు పలు చెరువుల్లోకి నీరు నింపేందుకు పరిశీలన చేపట్టినట్లు ప్రాజెక్ట్ ఈఈ యాదగిరి తెలిపారు. పూర్తి స్థాయి నివేదికను మంత్రి శ్రీధర్‌బాబుతో పాటు ఉన్నతాధికారులకు అందించనున్నట్లు పేర్కొన్నారు. ఈఈ వెంట డీఈఈ, ఏఈఈలు, స్థానిక రైతులు ఉన్నారు.

# రహదారుల విస్తరణతో ప్రయోజనం

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర, కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి రూరల్: రహదారుల విస్తరణ ద్వారా ప్రజలకు ప్రయోజనం కలుగుతుందని, అభివృద్ధితో పాటు ట్రాఫిక్ సమస్యలు సైతం తొలగిపోతాయని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. గురువారం ఐడీఓసీ కార్యాలయంలో అటవీ అనుమతులు మంజూరుపై అటవీ, జాతీయ రహదారులు, ఆర్‌అండ్‌బీ అధికారులతో రహదారుల విస్తరణ, నూతన రహదారులకు నిర్మాణాలకు అటవీ భూములు కేటాయింపుపై కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి ఎమ్మెల్యే సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అటవీ గ్రామాల్లో రహదారుల విస్తరణకు అటవీ భూములకు అనుమతులు మంజూరు చేయాలని అధికారులకు సూచించారు. డీఎఫ్ఓ నవీన్ రెడ్డి, ఆర్‌అండ్‌బీ ఈ ఈ వెంకటేశ్వర్లు, నేషనల్ హైవే ఈ ఈ మనోహర్, పంచాయతీ రాజ్ ఈఈ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

**పెండింగ్ పనులు పూర్తి చేయాలి**

నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న అన్ని అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని పంచాయతీ రాజ్ అధికారులకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సూచించారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పీఆర్ ఎస్ఈ, ఈఈ, డీఈ, ఏఈలతో ఎమ్మెల్యే సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే పలు అభివృద్ధి పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. అలాగే ఇరిగేషన్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న అన్ని పనులను నిర్దేశిత గడువులోపు పూర్తి చేసి రైతులకు సాగు, తాగు నీటి అవసరాలను తీర్చాలని సూచించారు. రైతులకు నిరంతరం సాగు నీరు అందించేందుకు ప్రణాళికలు రూపొందించాలని కోరారు. అదేవిధంగా, ఎస్సారెస్పీ డీబీయం -38, 31, 16 కాలువలతో పాటు అన్ని సాగునీటి కాల్వల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించాలని అధికారులకు సూచించారు.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

రేగొండ: మండల కేంద్రంలోని కాకతీయ గురుకుల విద్యాలయంలో 2009–10 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు గురువారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఎక్కడెక్కడో స్థిర పడిన వారంతా ఒకచోట చేరి గత అనుభవాలు నెమరువేసుకున్నారు. అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని ఆనందంగా గడిపారు. 15 సంవత్సరాల తర్వాత కలుసుకున్న వారంతా ఒకరినొకరు పలుకరించుకుని వారి జీవన స్థితిగతులు తెలుసుకుని ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా పాఠాలు చెప్పిన గురువులు నర్సయ్య, జానీ, రజినీకర్, కోటి, రమేష్, సందీప్‌లను ఘనంగా సన్మానించారు.

# వైన్‌షాపుల సిండికేట్‌ను అరికట్టాలి

- డీవైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తిరుపతి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

రేగొండ: మండల కేంద్రంలో వైన్ షాపు నిర్వహకుల సిండికేట్ దందాను అరికట్టాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తిరుపతి ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైన్‌షాపు నిర్వహకులు సిండికేట్‌గా ఏర్పడి గ్రామాల్లో బెల్ట్ షాపులను ప్రోత్సహిస్తూ అధిక ధరలకు మద్యాన్ని విక్రయిస్తున్నారన్నారు. వైన్స్ షాపులో కొన్ని బ్రాండ్లకు కొరత సృష్టిస్తూ, బెల్ట్ షాపులకు సప్లై చేస్తున్నారని ఆరోపించారు. అధికారుల నిర్లక్ష్యం వలనే వైన్స్‌షాపు యాజమానులు ఇష్టానుసారంగా మద్యం వ్యాపారం చేస్తున్నారని, గతంలో అనేక సార్లు ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యం అన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వైన్ షాపు నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మాటూరి సతీష్, మండల కన్వీనర్ బోగిరి నితిన్, నాయకులు పసుల బన్ని, నవీన్, రాకేష్, అజయ్ పాల్గొన్నారు.

# పీహెచ్‌సీలో రక్తదాన శిబిరం


ప్రశంస పత్రాలు అందజేస్తున్న వైద్యులు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ సుస్మిత ఆధ్వర్యంలో గురువారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. రక్తదాన శిబిరంలో వివిధ గ్రామాలకు చెందిన 21 మంది యువకులు రక్తదానం చేశారు. వారికి వైద్యాధికారి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ రక్త శిబిరంలో డాక్టర్ అక్షయ్, డాక్టర్ హరిణి, ల్యాబ్ టెక్నీషియన్లు శ్రీకాంత్, సంధ్య, శ్రీను, నర్సింగ్ ఆఫీసర్ సౌజన్య, కీర్తి పీహెచ్‌ఎన్ నీరజ, హెల్త్ సూపర్‌వైజర్ సమ్ము, హెల్త్ అసిస్టెంట్ రాజరమణయ్య, ఆశకార్యకర్తలు శ్రీలత, సుశీల ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గుడుంబా నిర్మూలనపై ప్రత్యేక డ్రైవ్

కాటారం: గ్రామాల్లో గుడుంబా నిర్మూలనపై ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో నెల రోజుల పాటు ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నట్లు కాటారం ఎక్సైజ్ ఎస్సై కిష్టయ్య గురువారం ఒక ప్రకటలనో తెలిపారు. డైరెక్టర్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కమలాసన్‌రెడ్డి, జిల్లా ఎక్సైజ్ అధికారి శ్రీనివాస్ ఆదేశాల మేరకు గుడుంబా నిర్మూలన కోసం ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. గుడుంబా తయారు చేసే, అమ్మకాలు చేపట్టే ప్రాంతాలను ఏబీసీడీగా వర్గీకరించి ప్రత్యేక నిఘా పెట్టినట్లు తెలిపారు. ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా గుడుంబా తయారు, సరఫరా, విక్రయించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

# వైకుంఠధామాల్లో వసతులు నిల్

- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు


వెంకటాపురంలోని వైకుంఠధామం

వెంకటాపురం(కె) : మండలంలోని 18 పంచాయతీల్లో గత ప్రభుత్వం వైకుంఠధామాలను నిర్మించింది. కాని వైకుంఠదామాల్లో ప్రజలకు కావాల్సిన సౌకర్యాలను ప్రభుత్వం, అధికారులు ఏర్పాటు చేయక పోవటంతో నిరుపయోగంగా మారాయి. మండలంలోని వీరభద్రవరం, వీఆర్‌కేపురం గ్రామ పంచాయతీల్లో నిర్మించిన వైకుంఠధామాల పనులు పూర్తి అయినప్పటికీ సౌకర్యాలు అధికారులు కల్పించలేదు. వైకుంఠధామాల్లో స్నానాలు చేసేందుకు బోర్‌లను ఏర్పాటు చేయలేదు, కొన్ని వైకుంఠదామాల్లో బోర్లు వేసిన వాటిని పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకురాక పోవటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ లేని సమయంలో నీరు నిలువ ఉంచుకునేందకు ఏర్పాటు చేసిన ట్యాంకులు కూడా నిరుపయోగంగా మారాయి. కొన్ని వైకుంఠధామాల్లో విద్యుత్ సౌకర్యాలను ఏర్పాటు చేయలేదు. విద్యుత్ సౌకర్యం లేని చోట్ల రాత్రి సమయంలో వెలుతురు ఉండేందుకు ఏర్పాటు చేసిన సోలార్ లైట్లు సైతం పనిచేయకుండా నిరుపయోగంగా మారాయి. వీఆర్‌కేపురం పంచాయతీల్లో ఏర్పాటు చేసిన వైకుంఠధామం పైకప్పు రేకులు లేచి పోయాయి. వైకుంఠధామాల్లో సౌకర్యాలు ఏర్పాటు చేయటంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వైకుంఠధామాల్లో అన్ని రకాల సౌకర్యాలు ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

### సౌకర్యాలు కల్పించాలి



వైకుంఠధామాల్లో ప్రలకు కావాల్సిన అన్ని రకాల సౌకర్యాలను అధికారులు ఏర్పాటు చేయాలి. సౌకర్యాలు పూర్తి స్థాయిలో లేక పోవటంతో వైకుంఠధామాల వద్ద ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. స్నానాలు చేసేందుకు సైతం బోర్‌లను ఏర్పాటు చేయాలి.

- జక్కుల రమేశ్, వెంకటాపురం

## పోలీసుల తనిఖీ

ఏటూరునాగారం: మండల కేంద్రంలో గురువారం ముమ్మరంగా తనిఖీలు చేపట్టినట్లు ఎస్సై తాజొద్దీన్ తెలిపారు. ప్రత్యేక శిక్షణ పొందిన స్నిఫర్ డాగ్‌తో బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో ఆర్టీసీ, ప్రైవేట్ వాహనాలు, ఆటోలు, కార్లు, ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించామన్నారు. నిత్యం ప్రతిరోజు మండలంలో విస్తృతంగా తనిఖీలు చేస్తున్నట్లు తెలిపారు. సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షిస్తున్నామన్నారు. జిల్లాలో మత్తు పదార్థాలను నిర్మూలించేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టామన్నారు. గంజాయి, డ్రగ్స్ వంటి పదార్థాలు ఎక్కడైన వినియోగించిన, విక్రయించిన వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వ్యక్తుల పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు.

## పోలీస్‌స్టేషన్ తనిఖీ


సిజ్ చేసిన వాహనాలను పరిశీలిస్తున్న సీఐ

మొగుళ్లపల్లి: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను గురువారం చిట్యాల సీఐ మల్లేశ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో సిబ్బంది వారు చేస్తున్న డ్యూటీలను అడిగి తెలుసుకున్నారు. డ్యూటీకి సంబంధించిన సలహాలు సూచనలు అందజేశారు. డయల్ 100 విషయంలో బ్లూకోల్ట్ సిబ్బంది ఆలస్యం చేయొద్దని చెప్పారు. పెండింగ్ కేసుల గురించి ఆరా తీశారు. రికార్డులను, వివిధ కేసులలో సీజ్ చేసిన వాహనాలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సై అశోక్, సిబ్బంది పాల్గొన్నారు.

## బాధ్యతల స్వీకరణ



**భూపాలపల్లి**

అర్బన్: భూపాలపల్లి ఎస్సై–1గా మచ్చ సాంబమూర్తి గురువారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లాలో ఇటీవల నిర్వహించిన ఎస్సైల బదిలీల్లో భాగంగా సాంబమూర్తి సీసీఎస్ నుంచి భూపాలపల్లికి బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేసిన సుధాకర్ టేకుమట్లకు బదిలీపై వెళ్లారు.

**పలిమెల ఎస్సైగా రమేశ్**



పలిమెల: పలిమెల పోలీస్‌స్టేషన్ ఎస్సైగా జంగిలి రమేశ్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఎస్సై తమాషారెడ్డి ఇటీవల బదిలీపై కాళేశ్వరం వెళ్లగా భూపాలపల్లి సీసీఎస్‌లో పనిచేస్తున్న రమేశ్‌ను పలిమెల పోలీస్‌స్టేషన్‌కు ఎస్సైగా నియమించారు. ఈ సందర్భంగా ఎస్సై రమేశ్ మాట్లాడుతూ ప్రజలు శాంతి భద్రత విషయంలో సహకరించాలని, ఎలాంటి సమస్యలున్న తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని తెలిపారు.

**ఎస్సైగా తమాషారెడ్డి**



కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం పోలీస్‌స్టేషన్ ఎస్సైగా జి.తమాషారెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న సీహెచ్.చక్రపాణి మహదేవపూర్ పోలీస్‌స్టేషన్ 2వ ఎస్సైగా బదిలీపై వెళ్లారు. ఎస్సైగా చార్జ్ తీసుకోవడంతో వచ్చెనెల ఫిబ్రవరిలో కుంభాభిషేకం 7,8,9 మూడు రోజులు, 26న మహాశివరాత్రి, మే నెలలో 15 నుంచి 26 వరకు 12 రోజుల పాటు సరస్వతినది పుష్కరాలకు పర్యవేక్షించనున్నారు.

## గుడుంబా పట్టివేత



భూపాలపల్లి రూరల్: గొర్లవీడు గ్రామ శివారు ప్రాంతం భూపాలపల్లి మండలంలో రూట్ వాచ్ నిర్వహిస్తుండగా ఒక ద్విచక్ర వాహనం, 10 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నట్లు భూపాలపల్లి ఎక్సైజ్ సీఐ రమ్యారెడ్డి తెలిపారు. వ్యక్తి పారిపోయాడాని ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నా రు. ఎక్సైజ్ జిల్లా టాస్క్ ఫోర్స్ రాజసమ్మయ్య, ఎస్సై రబ్బానీ, సిబ్బంది పాల్గొన్నారు.

# సాగు భూముల గుర్తింపు సర్వే


ఆర్‌అండ్‌ఆర్ సైట్‌ను పరిశీలిస్తున్న అవినాశ్

మల్హర్: రైతుభరోసా అమలులో భాగంగా సాగులో ఉన్న వ్యవసాయ భూములను గుర్తించేందుకు వ్యవసాయ, రెవెన్యూ, గ్రామ పంచాయతీ అధికారులు మండలంలో గురువారం సర్వే నిర్వహించారు. ఈనెల 20 వరకు నిర్వహించే క్షేత్రస్థాయి సర్వేలో లేఅవుట్లుగా మారిన భూములు, రోడ్లు, ఇండస్ట్రియల్, రాళ్లు, రప్పలు, గుట్టలతో ఉండి సాగు చేయని భూములు, వివిధ అవసరాలకోసం ప్రభుత్వం సేకరించిన భూములను గుర్తించి రైతుభరోసా నుంచి తొలగించనున్నారు. కాగా, మండలంలో తాడిచర్ల, వల్లెకుంట గ్రామాల్లోని సర్వేను మండల ప్రత్యేకాధికారి అవినాశ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లబ్ధిదారుల ఎంపిక చేయటంలో ప్రణాళికబద్ధంగా ముందుకెళ్లాని సూచించారు. ఈ కార్యక్రమంలో మహదేవపూర్ ఏడీఏ శ్రీపాల, మండల వ్యవసాయ అధికారి శ్రీజ, తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాలకు పరామర్శ


పరామర్శిస్తున్న బాల్యమిత్రులు


పరామర్శిస్తున్న కోటగిరి సతీశ్‌గౌడ్

టేకుమట్ల: మండలంలోని వెలిశాల గ్రామానికి చెందిన బోయిని సమ్మయ్య తండ్రి బోయిని లాలయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని సమ్మయ్య బాల్య మిత్ర బృందం గురువారం పరామర్శించి, ఆర్థికసాయం అందించారు. మహేందర్‌రావు, రవీందర్, నాంపెల్లి వీరేశం, గందం రాజనర్సు, కాసగాని మహేందర్, బోయిని తిరుపతి, కొమురయ్య, సమ్మయ్య, సతీష్, శ్రీను, తదితరులు ఉన్నారు.

**దుబ్యాలలో..**

మండలంలోని దుబ్యాల గ్రామానికి చెందిన బీఎస్పీ రాష్ట్ర ఈసీ సభ్యుడు సంగి రవి తండ్రి సంగి యేసుపాదం గురువారం మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కోటగిరి సతీశ్‌గౌడ్, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు పొన్నం భిక్షపతిగౌడ్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అంబాల చంద్రమౌళి పరామర్శించారు. కాంగ్రెస్, ఎమ్మార్పీఎస్, బీఎస్పీ నాయకులు బిక్కినేని సంపత్‌రావు, వంగ కుమారస్వామి, పోలుదాసరి రాజేశం, రేనుకుంట్ల శంకర్, మచ్చ శ్రీకాంత్, పారనంది భిక్షపతి, కన్నూరి సారయ్య, బోయిని కిష్టయ్య, తదితరులు ఉన్నారు.

# చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి


రాజమల్లు(ఫైల్)

చిట్యాల: భూమి విషయంలో గొడవపడి ఈనెల 13న ఓర్సు రాజమల్లు (65) అనే వ్యక్తి పురుగుల మందుతాగి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మండలంలోని శాంతినగర్ గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని శాంతినగర్ గ్రామానికి చెందిన ఓర్సు రాజమల్లు అతడి ఇంటి స్థల విషయంలో అదే గ్రామానికి చెందిన తుమ్మల శ్రీను, సంపంగి కొమురయ్యలతో గొడవపడ్డారు. దీంతో రాజమల్లును ఇద్దరు వ్యక్తులు తిట్టడంతో మనస్థాపం చెంది పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన సివిల్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఎంజీఎంకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతిడి కుమారుడు భిక్షపతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై శ్రావన్‌కుమార్ తెలిపారు.